క్లుప్తంగా

ఓటరు తుది జాబితా ప్రదర్శన

- యాచారం మండలంలో ఓటర్లు 50,509
- పోలింగ్ కేంద్రాలు 232



జాబితాను ప్రదర్శింపస్తున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఎంపీఓ శ్రీలత

యాచారం: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సంబంధిత అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి.. తన కార్యాలయంలో ఓటరు తుది జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రకటించారు. మండలంలో 50,509 ఓటర్లు, 232 పోలింగ్ కేంద్రాలు ఉన్న జాబితాను కార్యాలయంతో పాటు మండల పరిధి 24 గ్రామ పంచాయతీల వద్ద ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ నాగమణికి నివాళి



నాగమణి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న యూత్ సభ్యులు

యాచారం: కానిస్టేబుల్ నాగమణిది కుల దురహంకార హత్యేనని జై భీం యూత్ నాయకులు ఆరోపించారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల పరిధి నందివనపర్తి గ్రామంలో ఆమె చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తక్కువ కులానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుందన్న కక్షతోనే ఆమె సోదరుడు ఈ కిరాతకానికి పాల్పడ్డాడని ఆరోపించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు వివేక్, నరేందర్, ప్రశాంత్, నర్సింహ, స్వామి, బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత



దాత అందజేసిన పుస్తకాలతో చిన్నారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు దాతలు చేయూతనివ్వాలని ఎల్మినేడు జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ కోరారు. మండల పరిధి ఎల్మినేడు పాఠశాల విద్యార్థులకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు.. 5వ తరగతి గురుకుల ప్రవేశ పుస్తకాలు, 10వ తరగతి చదువుతున్న వారికి స్టడీ మెటీరియల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం సెక్రటరీ ప్రశాంత్, వైస్ ప్రెసిడెంట్ సూర్య నాయక్, సలహాదారులు గంగాధర్, మోగేష్ చౌహాన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రాందాస్

మంచాల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మ్యూజికల్‌చైర్, రన్నింగ్‌తో పాటు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈఓ రాందాస్, ప్రధానోపాధ్యాయుడు నర్సింహారెడ్డి, రఘుస్సి, ఈఆర్‌పీలు సత్యనారాయణ, యాదయ్య, సీఆర్‌పీలు జగదీష్, గిరీష్, కన్నయ్య పాల్గొన్నారు.

బ్యాంకులు సేవాభావంతో పని చేయాలి

తుక్కుగూడ: బ్యాంకులు నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలకు సూక్ష్మ రుణాలను అందజేసి, వారికి ఆర్థికంగా చేయూతను ఇవ్వాలని తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బరిగెల హేమలత సూచించారు. శనివారం పురపాలక కేంద్రంలోని ఆదర్శ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 27వ శాఖను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్యాంకులు లాభాపేక్ష కోసమే కాకుండా సేవాభావంతో పని చేయాలన్నారు.

సకల హంగులతో ‘సమీకృతం’

- విద్యాభివృద్ధికి సోపానం
- 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ భవన సముదాయం నిర్మాణం
- ఉన్నత ప్రమాణాలతో అందనున్న విద్యాబోధన
- హర్షం వ్యక్తంచేస్తున్న నియోజకవర్గ ప్రజలు



పాఠశాల నిర్మించనున్న స్థలాన్ని సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

తలకొండపల్లి: కులమతాలకు అతీతంగా నిరుపేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సమీకృత గురుకుల పాఠశాలల (యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్) ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం శాఖల వారీగా ఉన్న గురుకులాను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో 5 నుంచి 12వ తరగతి వరకు వీటిలో బోధన జరగనుంది.

పెరిగిన పోటీ..

సాంఘిక సంక్షేమ శాఖ, గురుకుల సొసైటీ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గతంలో గురుకులాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో బోధనతో పాటు వసతి, పదో తరగతిలో మెరుగైన ఫలితాలు, ఆంగ్ల మాధ్యమంలో బోధన వంటివి ఉండటంతో విద్యార్థులు అటువైపు ఆకర్షితులవుతున్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం గత ప్రభుత్వం బీసీ మైనారిటీ గురుకులాలను ప్రారంభించింది. ఐదు నుంచి పదో తరగతి వరకు వసతి సౌకర్యాలు కల్పించడంతో చాలా మంది ప్రవేశాలు పొందుతున్నారు. సీటు కోసం పోటీ పెరగడంతో అందుకు ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఆ శాఖ ఎంపిక చేస్తోంది.

3వేల మందికి అవకాశం

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. శాఖల వారీగా ఉన్న గురుకులాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చేందుకు దృష్టి సారించింది. ఇందులో భాగమే సమీకృత గురుకుల పాఠశాలల ఏర్పాటు. అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుకు నిర్ణయించింది. అనుకున్నదే తడవుగా.. కల్వకుర్తి నియోజకవర్గం ఖానాపూర్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న బాలబాలికలతో కొత్త వారికి అవకాశం కల్పించనున్నారు. సుమారు 2 వేల నుంచి 3 వేల మంది చిన్నారుల చదువు, వసతికి అవసరమైన విశాలమైన గదుల నిర్మాణం, బోధన, బోధనేతర సిబ్బందికి వసతి కల్పిస్తారు. ఇన్నోవేటివ్ బోధన విధానం, కంప్యూటర్ సెంటర్, గ్రంథాలయం, ఆడిటోరియం, డైనింగ్, వంటగది, వైద్యశాల ఇండోర్ గేమ్స్, క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, వాలీబాల్ టెన్నిస్ కోర్టులు, జిమ్, ల్యాండ్ స్కేప్, కోర్టు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.

25 ఎకరాల్లో..

ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మండల పరిధి ఖానాపూర్ శివారులో ప్రభుత్వం నిర్మించనుంది. సర్వే నంబర్ 256లో 52 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులోని 25 ఎకరాల్లో రూ.125 కోట్లతో భవన సముదాయం రూపుదిద్దుకోనుంది. ఇప్పటికే తహసీల్దార్, రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. హద్దులు గుర్తించారు. మ్యాప్‌ను సిద్ధం చేశారు.

సంతోషంగా ఉంది



మండలంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మించడం సంతోషంగా ఉంది. పేద విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి కృతజ్ఞతలు.

– ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, తలకొండపల్లి

పేద విద్యార్థులకు మేలు



ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో ఎస్సీ,ఎస్టీ,బీసీ,ఓబీసీ, మైనార్టీ వర్గాల పిల్లలకు మేలు జరుగనుంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల విద్యార్థులతో పాటు, కేశంపేట్, షాద్‌నగర్, జడ్చర్ల, నాగర్ కర్నూల్ తదితర పట్టణాల నిరుపేద బాలబాలికలకు అత్యాధునిక సౌకర్యాలతో పాటు, నాణ్యమైన విద్య అందనుంది.

– ఎండీ అజీం, మార్కెట్ డైరెక్టర్, ఆమనగల్లు(తలకొండపల్లి)

త్వరలో భూమి పూజ



కల్వకుర్తి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరయింది. ఖానాపూర్ శివారులో అత్యాధునిక, సకల సౌకర్యాలతో నిర్మించనున్నాం. అందుకు స్థలం ఎంపిక చేశాం. భవన సముదాయ నిర్మాణానికి త్వరలో భూమి పూజ చేస్తాం.

–కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే, కల్వకుర్తి

పనిచేసే వారికి ప్రాధాన్యత

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- కాంగ్రెస్ సేవాదళ్ సభ్యులకు పత్రాల అందజేత



మంచాల: అజయ్ కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. కష్టపడి పని చేసిన వారికి పార్టీలో తగిన ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా మండల పరిధి ఆగాపల్లి గ్రామానికి చెందిన బద్దుల అజయ్ కుమార్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే.. అజయ్‌కుమార్‌కు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసు, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్, ఆనంద్, లింగం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా నర్సింహ

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడిగా పోచారం గ్రామానికి చెందిన గౌరిగే నర్సింహ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. నమ్మకంతో తనకు బాధ్యతలు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

యాచారం: పేదలకు అత్యవసర సమయాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండగా ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అర్హులైన పేదలు నేరుగా తన వద్దకు వచ్చి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల పరిధి నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన గడ్డం రాములు ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందగా.. ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం సహకారంతో రాములు వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే.. రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, గణేశ్, కుమార్, గడ్డం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కాదు.. నిర్బంధ పాలన

- విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడం తప్పా?
- బీఆర్ఎస్ యువజన నాయకుల ధ్వజం



కేజీబీవీ వసతిగృహం ఎదుట ఆందోళన వ్యక్తంచేస్తున్న యువజన నాయకులు

మంచాల: కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదు.. నిర్బంధ పాలన అని బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు వనపర్తి బద్రినాథ్ గుప్తా ఆరోపించారు. నిరుపేద గిరిజన బిడ్డలు చదువుకునే హాస్టల్ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వారి ఇబ్బందులను తెలుసుకునేందుకు వచ్చిన తమను అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గిరిజన బాలికల హాస్టల్ విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి యువజన విభాగం ఆధ్వర్యంలో నాయకులు వెళ్లగా.. అనుమతి లేనిదే లోపలికి రావొద్దంటూ అక్కడి సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో అక్కడే గేట్ ఎదుట కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మట్లాడుతూ.. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకోవడం తప్పా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నియంతృత్వ పాలన పతనం తప్పదని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన రాష్ట్ర నాయకులు శేఖర్, వీరేశం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జాని పాష, మండల నాయకులు రాములు, జంగయ్య, శ్రీకాంత్, మహేందర్, కృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

గ్యారంటీల పేరుతో గారడీ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం: బీజేపీ నేతలు
- బైక్‌ర్యాలీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తలకొండపల్లి: అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో విఫలమయిందని బీజేపీ జిల్లా కార్యదర్శి పాండుప్రసాద్ ఆరోపించారు. గ్యారంటీల పేరుతో గారడీ చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా.. పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కల్వకుర్తి (పట్టణం) నియోజకవర్గంలో నిర్వహించనున్న భారీ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. శనివారం మండల కేంద్రంలో పాండు ప్రసాద్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ప్రతి నెల రూ.2500 ఆర్థిక సాయం, 18 ఏళ్లు నిండి, చదువుకునే ప్రతి యువతికి స్కూటీ, ఆడబిడ్డ వివాహానికి రూ.1 లక్ష, తులం బంగారం ఇస్తానని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. అధికారం చేపట్టిన తరువాత వాటిని పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకూ ఎకరానికి రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు సాయం చేస్తామని చెప్పి ఇంత వరకు ఇవ్వలేదన్నారు. యువ వికాసంలో భాగంగా విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. కానీ నేటికీ ఎవరికీ ఇవ్వలేదని వెల్లడించారు. ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం.. కాంగ్రెస్ భస్మాసుర హస్తమే అయిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు మాజీ సర్పంచ్ బక్కి కుమార్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పాండు, అసెంబ్లీ కన్వీనర్ అనిల్, కుమార్, జంగయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

- ఎంపీడీఓ శ్రీకాంత్
- సీఎం కప్పు క్రీడా పోటీలు ప్రారంభం



తలకొండపల్లి: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ తదితరులు

తలకొండపల్లి: విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ శ్రీకాంత్ అన్నారు. ఆటల పోటీలతో కొత్త వ్యక్తులతో పరిచయం ఏర్పడి స్నేహ భావం పెంపొందుతుందని పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలను మార్కెట్ డైరెక్టర్ అజీంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, దేహదారుఢ్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. టోర్నీలో ప్రతిభను కనబరచి, మండల, జిల్లా స్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్–2024 క్రీడా పోటీలు షురూ అయ్యాయి. శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో మండల విద్యాధికారి హిర్యానాయక్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 7,8,9 తేదీల్లో గ్రామీణ స్థాయి పోటీల్లో విజేతలైన విద్యార్థులను.. మండల స్థాయి, అందులో ప్రతిభ చూపిన బాలబాలికలను జిల్లా టోర్నీకి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రవీంద్రసాగర్, పీఈటీలు, ఎంపికైన క్రీడాకారులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మతు

కడ్తాల్: మండల పరిధి మక్తమాధారం– నేదునూర్ రహదారి మరమ్మతు పనులు కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు తన సొంత ఖర్చుతో చేయించారు. రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడి.. వాహనదారులకు ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. శనివారం జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో రోడ్డును చదును చేయించారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు బాలరాజును అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, శంకర్‌నాయక్, సత్యనారాయణ, శ్రీనివాస్, కన్నయ్య తదితరులు ఉన్నారు.

రాయితీ స్ప్రింక్లర్లకు దరఖాస్తు చేసుకోండి

మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గీత



ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై స్ప్రింక్లర్లు అందజేస్తుందని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల రైతులు రూ7.500లు డీడీ తీసి, మీ సేవ కేంద్రాల్లో అర్జీ పెట్టుకోవాలన్నారు. అనంతరం ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. రాయితీ పథకాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై స్ప్రింక్లర్లు అందజేస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ డైరెక్టర్ అజీం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల కడ్తాల్ మండలాల రైతులకు రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. రూ.7500లు బ్యాంక్‌లో చెల్లించి, మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు.

యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడికి సన్మానం



ఇమ్రాన్ బాబాను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఇమ్రాన్ బాబాను శనివారం పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రాజేందర్‌గౌడ్ నాయకులు రాఫీ, ఉపేందర్, మురళీ తదితరులు ఉన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తలకొండపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ ఆరోపించారు. 6 గ్యారంటీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకోని పక్షంలో ఉద్యమాలతో ప్రభుత్వ పాలనను స్తంభింపచేస్తామని హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా.. ఎకరాకు రూ.15వేలు రైతుభరోసా ఇవ్వలేదని, నేటివరకు రైతుబంధు అమలు చేయలేదని పేర్కొన్నారు. రైతుబంధును వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత, జ్యోతయ్య, పాండు, నర్సింహ, గణేశ్, రాజు, కృష్ణ, కుమార్, శ్రీను, గోవర్ధన్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విజేతలతో కరస్పాండెంట్ సువర్ణ, ఉపాధ్యాయులు

కడ్తాల్: ‘సాక్షి’ స్పెల్ బీ పరీక్షల్లో తమ విద్యార్థులు సెమీ ఫైనల్‌కు వెళ్లారని ప్రగతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ సువర్ణ తెలిపారు. గత నెల హైదరాబాద్‌లో నిర్వహించిన పరీక్షకు 7వేల మంది విద్యార్థులు హాజరుకాగా, తమ పాఠశాల నుంచి 63 మంది పాల్గొన్నారని తెలిపారు. వీరిలో తొమ్మిది మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, సెమీ ఫైనల్‌కు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులను శనివారం అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జైసన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత: డీఆర్‌డీఓ

మహేశ్వరం: మహిళలు డ్వాక్రా సంఘంలో రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఓ శ్రీలత పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.కోటి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలు తీసుకొని సొంత అవసరాలకు ఉపయోగించకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, ఆర్థికంగా ఎదగాలన్నారు. రుణాలు ఎవరికైతే అవసరం ఉంటుందో వారే తీసుకొని సక్రమంగా చెల్లించాలన్నారు.

‘చలో హైదరాబాద్’ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఆమనగల్లు: ప్రభుత్వం తెచ్చిన 317జీఓ ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఉపాధ్యాయ సంఘం జేఏసీ అధ్యక్షుడు కానుగుల మల్లేశ్ డిమాండ్ చేశారు. శనివారం ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే చలో హైదరాబాద్ ధర్నా పోస్టర్‌ను ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు శ్రీనివాస్, అలివేలు, సత్య, రాములు, శ్రీశైలం, జ్ఞానేశ్వర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయం పాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

యాచారం: విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టి తోటివారికి పాఠాలు బోధించారు. మండల పరిధి నందివనపర్తి ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ హోదాల్లో ఆకట్టుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణశాస్త్రి, ఉపాధ్యాయులు కిషన్, వెంకట్ రెడ్డి, పద్మశ్రీ, అరుణ, శ్రీలత పాల్గొన్నారు.